# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 129 ప్రకాశం, ఆదివారం 08- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ప్రణాళిక బద్ధంగా చదవాలి విజయతీరాలను చేరండి

### విద్యార్థులకు వి. శరత్ బాబు సూచన



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు**,విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా పాఠ్యఅంశా లను అధ్యయనం చేసి ఈ నెలలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను వివేవకంతో వ్రాసి విజయతీరాలను చేరాలని హ్యూమన్ వెల్ఫేర్ అండ్ జస్టిస్ అసోసియేషన్ పబ్లిక్ సేఫ్టీ ఆఫీసర్ వి. శరత్ బాబు సూచించారు. విద్యార్థులు బ్లూ ప్రింట్ ను దృష్టి యందు ఉంచుకొని తదనగుణంగా ఆయా పాఠ్యాంశాలను అధ్యయనం చేయడం వల్ల అత్యధిక మార్కులను పొందవచ్చు న్నారు. పరీక్షలలో ఎలాంటి ఒత్తిడికి తావు లేకుండా, ప్రశాంత చిత్తంతో ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పిదప జవాబులు వ్రాయాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. పరీక్షలు అంటే భయపడాల్సిన అవసరం లేదని, మీరు చదివిన పాఠ్యాంశాలను పునచ్చరణ చేసుకొని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై, మంచి ర్యాంకులను పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు.

## దిశా కమిటీ సమావేశము




**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి**, నగరములోని ప్రకాశం భవనం లోని పిజిఆర్ఎస్ హాల్ లో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన దిశా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి , జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి , ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత , కమిటీ సభ్యులు కొర్రపాటి శ్రీనివాసరావు,బద్దిపూడి మార్క్,దొడ్డా పార్వతి , తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లకు బ్లాక్ వైట్ గుర్తులు ఏర్పాటు



**గుడ్లూరు క్రైం కౌంటర్ ప్రతినిధి**,మండలం లోని మోచర్ల గ్రామం సమీపంలో ఉన్న నేషనల్ హైవే--16 నుండి గ్రామంలోకి వెళ్లే అప్రోచ్ రోడ్లపై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించే విధంగా వైట్ పెయింట్ , బ్లాక్ మార్కులతో గుర్తులను ఏర్పాటు చేశారు. దీనివలన రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు చర్యలను తీసుకుంటామని ఎస్ ఐ వెంకట్రావు తెలిపారు.

## సిబ్బంది సకాలంలో సర్వేలను పూర్తి చేయాలి ఎంపీడీవో శంకరరావు



**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి**,మండలములోని పోకూరు, శాఖవరం, కొండ సముద్రం , శామీర పాలెంసచివాలయంలను ఎంపీడీవో శంకర రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని తెలియ జేశారు . ఐ విఆర్ ఎస్ కాల్స్ పై ప్రజల కు అవగాహన కల్పించారు. శాఖవరం లో ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డును సందర్శించారు. అవసరమైన సచివాలయంలలో క్లాప్ మిత్ర లనునియమించుకోవలసినదిగా వారికి ప్రతి నెల సాలరీస్ చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ లలో అక్షర ఆధార్ సెంటర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులనుజారీ చేసి ఉన్నందున సెంటర్లు నిర్వహించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

## బైరెడ్డి వెంకటరెడ్డి , ని పరామర్శించిన మాజి ఎమ్మెల్యే అన్నా



**క్రైమ్ కౌంటర్ న్యూస్....**ఒంగోలు పట్టణంలోని ఉపాస్ హాస్పిటల్ నందు కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి వెంకటరెడ్డి , రోడ్డు ప్రమాదంలో గాయపడి ఉపాస్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు , వెంకటరెడ్డి ,ని పరామర్శించడం జరిగింది...అన్నా వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు..

## నేడు కాపునాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం




**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి**, ఒంగోలుపార్లమెంట్ అధ్యక్షులు పోగులమల్లికార్జునరావు మాట్లాడుతూ విజయవాడలోని గాంధీనగర్ హోటల్ ఐలాపురం లో రాష్ట్ర కాపునాడు కార్యవర్గ సమావేశం ఆదివారం మధ్యాహ్నం గంటలకు జరుగుతుందని ఆయన వివరించారు.ఈ సమావేశానికి కాపునాడు జాతీయ అధ్యక్షులు కాళ్ళ సుబ్రహ్మణ్యం కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు అర్జా రామకృష్ణ జోన్ ఫోర్ అధ్యక్షుడు బండారు మహేష్ నాయుడు హాజరవుతారనీ ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంటు పరిధిలోని 9 నియోజకవర్గాల అధ్యక్షులు, కార్యదర్శులు మండల స్థాయి కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు .ఈ సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నో ఆశలతో మనం గెలిపించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో మెరుగుపడాల్సిన కాపు సామాజిక వర్గం అందుకు భిన్నంగా అయోమయంలో ఉందనీ చెప్పారు. వీటన్నిటిపై చర్చించి సమీక్షించాల్సిన అవసరం ఆసన్నమైశీదని రాష్ట్ర కమిటీ సమావేశం జరుగుతుశీదని తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా యువజన అధ్యక్షుడు బండారు సురేష్ బాబు ఉపాధ్యక్షులు చెంగలశెట్టి సుధాకర్ జాయింట్ సెక్రెటరీ గారా నారాయణరావు జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షుడు మేకల నారాయణ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచాల కవిత ఒంగోలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నగుబోతు నిర్మల, లక్ష్మీ ప్రసన్న, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా......**

తర్లుపాడు మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ వేణుగోపాల్ స్వామి బ్రహ్మోత్సవాల లో అపశృతి....బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వశుప్ ప్రదర్శనలో బండ లాగుతూ ఎద్దు మృతి...

మృతి చెందిన ఎద్దు నంద్యాల జిల్లా అలగనూరుకు రైతు కు చెందినది......

## తమిళ భాషా సంస్కృతులే ప్రపంచానికి భారత్ అందించిన అమూల్య కానుక: ప్రధాని మోదీ ప్రశంసలు

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07** ప్రపంచ నాగరికతకు భారతదేశం అందించిన అత్యున్నతమైన మరియు పురాతనమైన వరం తమిళ భాష అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. మలేషియా పర్యటనలో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, తమిళ సాహిత్యం యొక్క గొప్పతనాన్ని ఆకాశానికెత్తారు. వేల ఏళ్ల చరిత్ర కలిగిన తమిళ సంస్కృతి కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదని, అది మానవాళి మొత్తానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదిగిందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

తమిళ ప్రజలు తమ అద్భుతమైన మేధస్సు మరియు ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. శాస్త్ర సాంకేతిక రంగాల నుండి పరిపాలన వరకు తమిళులు చూపుతున్న చొరవ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కేవలం భారత్‌లోనే కాకుండా, ప్రపంచంలోని అనేక దేశాల అభివృద్ధిలో తమిళ సోదర సోదరీమణులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

దేశ అత్యున్నత పదవుల్లో తమిళుల ప్రాతినిధ్యాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేశారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల నుండి నేటి కేంద్ర క్యాబినెట్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాయకుల వరకు, తమిళులకు సముచిత స్థానం దక్కడం సంతోషకరమని అన్నారు. పరిపాలనా దక్షతలో తమిళులు ఎప్పుడూ ముందుంటారని, వారి



క్రమశిక్షణ మరియు పనితీరు భారత ప్రభుత్వానికి బలమైన శక్తిని ఇస్తున్నాయని ఆయన ప్రశంసల జల్లు కురిపించారు.

భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, వివిధ భాషలు మరియు సంస్కృతులు ఉన్నప్పటికీ మనమంతా ఒకటేనని మోదీ పునరుద్ఘాటించారు. తమిళ సంస్కృతి భారతీయతకు ఒక ఆభరణం లాంటిదని, దాన్ని కాపాడుకోవడం మరియు ప్రపంచానికి చాటి చెప్పడం మన బాధ్యతని వివరించారు. ఈ సదస్సు ద్వారా భారతీయ వారసత్వాన్ని విదేశాల్లో కూడా సగర్వంగా చాటుతున్న ప్రవాస భారతీయుల కృషిని ఆయన అభినందించారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ సెంటర్ల ను ఆర్ఐఓ టి వరప్రసాద్ రావు శనివారం పరిశీలించారు.



క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్ ,ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ సెంటర్ల ను ఆర్ఐఓ టి వరప్రసాద్ రావు శనివారం పరిశీలించారు.ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాలు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్, కళాశాల వివేక జూనియర్ , కళాశాల ఆక్స్ఫర్డ్ మహిళా జూనియర్ కళాశాల, నాగార్జున జూనియర్ కళాశాల, గురుస్తాన్ జూనియర్ కళాశాల ,శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలను పరిశీలించి ప్రాక్టికలు జరుగు విధానం మీద సంతృప్తి వ్యక్తపరిచారు. ఆయా పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు ప్రయోగాలు జరిగే విధానమును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల యొక్క చీఫ్ సూపర్డెంట్ లను ఇదే విధముగా జరగబోవు థియరీ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆర్ ఐ ఓ వరప్రసాద రావు మాట్లాడుతూ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు నియమ నిబంధనలను అనుసరించి నిర్వహిస్తున్నామని, ఎక్కడ నిర్లక్ష్యం తెలుత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని , అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని, అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నామని నేను గాని మా జిల్లా పరీక్షల కమిటీ అన్ని జాగ్రత్తలను తీసుకొన్నామని తెలియజేశారు.

## నెయ్యిపై కొండెక్కిన విచారణ!

**ఏడాదిన్నర కిందట తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పుడు సింహాచలంలోనూ తనిఖీలు**

**పరీక్షకు నమూనాలు**

**27 డబ్బాల నెయ్యి వెనక్కి...**

**లోపం లేదని తేలిందంటున్న అధికారులు**

**అలాంటప్పుడు గుట్టు చప్పుడు కాకుండా 'రైతు డెయిరీ' కాంట్రాక్టు ఎందుకు రద్దు చేశారనే ప్రశ్నలు**

**మొన్నటిదాకా విశాఖ డెయిరీ, ఇప్పుడు 'సంగం' డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు**



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07 విశాఖపట్నంసింహాచలం దేవస్థానంలో తక్కువ ఖరీదు నెయ్యి వాడకంపై విచారణ కొండెక్కింది. ఎవరిపైనా చర్యలు చేపట్టలేదు. ఆ కాంట్రాక్టర్ నుంచి నెయ్యి తీసుకోవడం ఆపేశారు. విశాఖ డెయిరీ నుంచి కొన్నాళ్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు వారిని పక్కనపెట్టి సంగం డెయిరీకి కాంట్రాక్టు ఇచ్చారు.

రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ప్రసాదాల తయారీ, దీపారాధనలకు నాణ్యమైన నెయ్యి వాడడం లేదని తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంతో ఏడాదిన్నర క్రితం వెలుగులోకి వచ్చింది. ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికే కాంట్రాక్టు ఇవ్వాలని దేవదాయ శాఖ ఆదేశాలు ఇవ్వడంతో ప్రధాన ఆలయాల్లో టెండర్లు పిలిచి ఎల్–1 వచ్చిన వారికి నెయ్యి సరఫరా బాధ్యత అప్పగిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో నాణ్యమైన నెయ్యి కిలో రూ.600తో ప్రారంభమై రూ.2 వేల వరకూ ఉంది. కానీ కాంట్రాక్టర్లు కిలో రూ.350 నుంచి రూ.400 మధ్య కోట్ చేసి టెండర్ దక్కించుకుంటున్నారు. గిట్టుబాటు కోసం నెయ్యిని కల్తీని చేస్తున్నారు. ఈ విషయం ఆలయ అధికారులకు తెలిసినా చూసీచూడనట్టుగా పోయారు. తిరుపతి లడ్డూ కల్తీ వివాదం బయటకు వచ్చాక...సింహాచలంలో ఏమి జరుగుతోంది? అంటూ 2024 సెప్టెంబరులో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. కిలో రూ.591కి సరఫరా చేస్తున్న విశాఖ డెయిరీని పక్కనపెట్టి, 2022–23లో కిలో రూ.393.30కే సరఫరా చేస్తామని ఉత్తరప్రదేశ్కు చెందిన ప్రీమియర్ ఆగ్రోటెక్ ఫుడ్స్ సంస్థ ముందుకు రావడంతో 54 వేల కిలోల ఆర్డర్ ఇచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విశాఖకు చెందిన సూర్యకుమారి ఏజెన్సీ కిలోకు రూ.529 కోట్ చేయగా కాంట్రాక్టు వారికి ఇచ్చారు. ఆ సంస్థ నుంచి 26,430 కిలోలు కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రైతు డెయిరీ కిలో రూ.344కే కోట్ చేసింది. వారికి 47,175 కిలోలకు ఆర్డర్ ఇచ్చారు. సింహాచలం ప్రసాదం నాణ్యంగా లేదని ఫిర్యాదులు రావడంతో ఏ నెయ్యి వాడుతున్నారో అంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. వెంటనే స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆలయానికి వెళ్లి అన్నీ పరిశీలించారు. నెయ్యి వాసన లేకపోవడంతో వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులను పిలిపించి శాంపిళు తీయించి పరీక్షకు పంపించారు. అక్కడి నెయ్యి డబ్బాలన్నింటిని (945 కిలోలు) సీజ్ చేశారు. నివేదిక ఏమి వచ్చిందో తెలియదు గానీ 27 డబ్బాల నెయ్యిని వెనక్కి పంపించేశారు. ఆ వెంటనే విశాఖ డెయిరీ నుంచి కిలో రూ.605 చొప్పున కొనుగోలు చేశారు. 2025 డిసెంబరు వరకు ఆ డెయిరీ నుంచే నెయ్యి వచ్చింది. 2026 జనవరి నుంచి సంగం డెయిరీ నుంచి తీసుకుంటున్నారు. వారు కిలో రూ.649.90 చొప్పున ఇస్తున్నారు. డెయిరీని ఎందుకు మార్చారో, రేటు ఎందుకు పెరిగిందో తెలియదు. టెండర్ ప్రకారమే ఇచ్చామని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.

**నెయ్యిలో లోపం లేదట**

సింహాచలం దేవస్థానానికి రైతు డెయిరీ కిలో రూ.344 చొప్పున సరఫరా చేసిన నెయ్యిలో ఎటువంటి లోపాలు కనిపించలేదని అధికార వర్గాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి. నివేదిక బాగానే వచ్చిందని పేర్కొన్నారు. అలాగైతే తక్కువ ధరకు వస్తున్న ఆ నెయ్యిని కొనకుండా రెట్టింపు ధర పెట్టి ఇతర డెయిరీల నుంచి నెయ్యిని ఎందుకు కొంటున్నారంటే మాత్రం సమాధానం చెప్పలేదు. నివేదికలో ఏమీ లేనందున ఏ అధికారిపైనా చర్యలు తీసుకోలేదని సమర్థించుకుంటున్నారు. జరిగిందేదో జరిగిపోయిందని, ఇప్పుడు లోపాలు లేకుండా చూసుకుంటున్నామని మరో అధికారి తెలిపారు.

## క్వాంటం టెక్నాలజీకి కేంద్రంగా అమరావతిని మారుస్తాము: సీఎం చంద్రబాబు

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07 అమరావతి: ఏపీని సాంకేతికంగా అగ్రగామి రాష్ట్రంగా నిలిపే దిశగా నేడు(శనివారం) కీలక అడుగు పడింది. రాజధానిలోని ఉద్దండరాయుని పాలెంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్తోపాటు భారతదేశానికీ ఇదొక చరిత్రాత్మక దినమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇవాళ క్వాంటం వ్యాలీ భవనాలకు మాత్రమే పునాది వేయటం లేదని, గ్లోబల్ క్వాంటం రెవల్యూషన్లో భాగమయ్యే నిపుణులకు కూడా పునాది వేసుకుంటున్నామని వ్యాఖ్యానించారు. ఐక్య రాజ్యసమితి కూడా ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇది క్వాంటం ట్రాన్సిషన్ మూమెంట్గా నిలిచిపోతుందని భావిస్తున్నానని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సామర్థ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో క్వాంటం టెక్నాలజీ ఓ కీలకమైన ముందడుగు అవుతుందని అన్నారు. గతంలో వచ్చిన వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాన్ని భారత్ అందిపుచ్చుకోలేక పోయిందని అన్నారు. కానీ ఐటీ విప్లవంలో దేశం ముందడుగు వేసిందని చెప్పారు.గతంలో హైదరాబాద్లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ ప్రారంభించామని గుర్తు చేశారు. అది ఓ గేమ్ ఛేంజర్గా మారి ఫలితాలను ఇస్తోందన్నారు. హైటెక్ సిటీ తరహాలోనే క్వాంటం టెక్నాలజీకి కేంద్రంగా అమరావతిని మారుస్తామని చెప్పారు. భారత్లో ఏర్పాటు చేస్తున్న తొలి అమరావతి క్వాంటం వ్యాలీని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారన్నారు. ఇది కూడా ఓ విప్లవంగా మారుతుందని అన్నారు. సాంకేతిక విప్లవాన్ని ఆచరించే ప్రధాని నరేంద్ర మోదీ కూడా బీఎస్ఎన్ఎల్ 4జీ స్టాక్ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ సాంకేతికత ద్వారా 6జీ కమ్యూనికేషన్ కూడా సాధ్యం అవుతుందని అన్నారు. ఇదే తరహాలో భారత్ నుంచి వేర్వేరు ఉత్పత్తులను ప్రపంచానికి అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

గతంలో ఐటీ గురించి, సెల్ ఫోన్ల గురించి మాట్లాడితే తనను విమర్శించిన వారి పిల్లలు ఇప్పుడంతా ఐటీ రంగంలో అమెరికాలో స్థిరపడ్డారని అన్నారు. వచ్చే 30–40 ఏళ్లలో ఆచరణలోకి వచ్చే అంశాలపై తానెప్పుడూ ఆలోచన చేస్తానని చంద్రబాబు అన్నారు. దానికి అనుగుణంగానే ప్రణాళికలు ఉంటాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకున్న దేశమే భవిష్యత్తులో అభివృద్ధి సాధించగలుగుతుందని అన్నారు.క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలకు కేంద్రంగా ఏపీ మారుతుందనీ సీఎం చంద్రబాబు చెప్పారు. క్వాంటం డిజైన్స్, క్వాంటం ఉత్పత్తులు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్కు అమరావతి కేంద్రం అవుతుందని చెప్పారు. డిఫెన్స్, హెల్త్ కేర్,



ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమేట్ మోడలింగ్ కు అమరావతి క్వాంటం వ్యాలీలో పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతాయని అన్నారు. ఇప్పటి వరకూ అంతా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారని, ఇక నుంచి అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుకుంటారని చెప్పారు.

క్వాంటం టెక్నాలజీ కోర్స్ కోసం ఇప్పటికే 66వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఇండియాలో రిజిస్టర్ చేసుకున్న వాళ్లలో 50శాతం కేవలం ఏపీకి చెందిన వారేనని చెప్పారు. కుప్పానికి చెందిన ఓ స్టూడెంట్ బ్లడ్ ప్లజర్, పల్స్ చూసే యాప్ను కనిపెట్టాడని తెలిపారు. కాబట్టి ఇక్కడ ఉన్న విద్యార్థులు ఎన్నో సాధించాలని పిలుపునిచ్చారు.ఏపీలోని స్టూడెంట్స్ ఏఐని అడాప్ట్ చేసుకోవాలని అన్నారు ముఖ్యమంత్రి. క్వాంటం ఆల్గరిథమ్లు రాయాలని సూచించారు. అప్పుడే విద్యార్థులు గేమ్ ఛేంజర్లుగా మారుతారని చెప్పారు. ఇప్పటికే స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, సెమికండెక్టర్ సిటీ, మెడ్ టెక్ వంటివి ప్రారంభించామని వివరించారు. తిరుపతిలో స్పేస్ సిటీకి రావాలని కేంద్ర మంత్రిని కోరుతున్నానని అన్నారు. అక్కడి నుంచి త్వరలోనే శాటిలైట్లు లాంచ్ చేసే రోజూ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దీనికి ఇక్కడున్న రైతులే ప్రధాన భాగస్వాములని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ గా అమరావతి తయారవుతుందని అన్నారు. ప్రపంచశ్రేణి క్వాంటం టెక్నాలజీ నగరంగా అమరావతి మారుతుందని చెప్పారు. భారత్లోని మొదటి 133–క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.

## న్యాయ ఫలాలు అట్టడుగు వర్గాలకు దక్కాలి




క్రైం కౌంటర్ న్యూస్ : తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 7 న్యాయ ఫలాలు అట్టడుగు వర్గాలకు దక్కాలని అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా ఆర్.వెంకటరమణి ఆకాంక్షించారు. ఎస్వీయూ లా విభాగం చేపట్టిన న్యాయోత్సవ్–2కె26ను శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. న్యాయ వ్యవస్థతోనే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీలు విజ్ఞాన సృష్టి కేంద్రాలని చెప్పారు. లా స్టూడెంట్స్ నీరసంగా ఉండకూడదని, సృజన అవసరమన్నారు. పెద్ద ప్రజాస్వామ్య దేశంలో సంక్లిష్టతలను అర్థం చేసుకోవాలని కోరారు. కృత్రిమ మేధస్సులో మనం చూడని అంశాలను చూస్తున్నామన్నారు. అవి మీ మనస్సులను హైజాక్ చేస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏపీ హైకోర్టు అడిషనల్ జడ్జి అవధానం హరిహరనాథశర్మ మాట్లాడుతూ.. స్టూడెంట్స్ ఆఫ్ లా, లా స్టూడెంట్స్ పదాల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసీ డి.సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ.. న్యాయశాస్త్ర విద్యాధ్యయనంలోని పలు అంశాలను ప్రస్తావించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. అటార్నీ జనరల్ విశ్వవిద్యాలయానికి రావడం ఓ మైలురాయి అన్నారు. రెక్టార్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి ప్రసంగించారు. సమన్వయకర్తగా డీన్ భాస్కర్ రెడ్డి, లా విభాగ ప్రొఫెసర్ ఆదినారాయణ, ఐదేళ్ల లా కోర్సు అధ్యాపకులు అంజన్ సింగ్, మంజుల, భవ్య, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, అమరేశ్వరి, వెంకట్రమణ, వర్సిటీ కల్చరల్ కో–ఆర్డినేటర్ వివేక్ పత్తిపాటి, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, అటార్నీ జనరల్ రాక సందర్భంగా శ్రీనివాసా ఆడిటోరియం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా సభా ప్రాంగణం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేశారు.

## స్మార్ట్ సిటీ మిషన్.. పదేళ్లలో ?59,385 కోట్ల ఖర్చు.. తెలుగు రాష్ట్రాలకు దక్కని చోటు!

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07 కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్మార్ట్ సిటీ' మిషన్ పురోగతిపై తాజాగా వెలువడిన సమాచారం ఆసక్తికరంగా మారింది. ఒక (సమాచార హక్కు చట్టం) దరఖాస్తుకు సమాధానంగా కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 100 నగరాల్లో ఇప్పటివరకు కేవలం 31 నగరాలు మాత్రమే పూర్తిస్థాయిలో స్మార్ట్ సిటీలుగా రూపాంతరం చెందాయి. మిగిలిన నగరాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతుండగా, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో వేగం పెంచాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం గత పదేళ్ల కాలంలో ప్రభుత్వం భారీగా నిధులను వెచ్చించింది. దాదాపు ?59,385 కోట్ల రూపాయలను స్మార్ట్ సిటీల అభివృద్ధి కోసం ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఇప్పటికే పూర్తయిన 31 నగరాల జాబితాలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ నుంచి ఒక్క నగరం కూడా చోటు దక్కించుకోకపోవడం గమనార్హం. మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక పరిజ్ఞానం జోడింపు వంటి అంశాల్లో తెలుగు నగరాలు ఇంకా తుది మెరుగులు దిద్దుకోవాల్సి ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం సహా మరో 43 నగరాల్లో అభివృద్ధి పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. వైజాగ్ వంటి ప్రధాన నగరాల్లో స్మార్ట్ ప్రాజెక్టులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, కాకినాడ మరియు తిరుపతి వంటి మరో 26 పట్టణాల్లో మాత్రం పనులు పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం పట్టేలా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న సాంకేతిక ఇబ్బందులు లేదా నిధుల వినియోగంలో జాప్యం కారణంగా ఈ నగరాలు స్మార్ట్ హోదా కోసం నిరీక్షించక తప్పని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఈ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులన్నీ 2025 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది. గడువు సమీపిస్తున్న తరుణంలో, పెండింగ్లో ఉన్న పనులను వేగవంతం చేయడం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. ఆధునిక రవాణా వ్యవస్థ, స్మార్ట్ లైటింగ్, డ్రైనేజీ మేనేజ్మెంట్ వంటి కీలక అంశాలపై దృష్టి సారించి, గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవడమే లక్ష్యంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ నగరాలన్నీ డిజిటల్ మరియు మౌలిక సదుపాయాల పరంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకుంటాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# గ్రూప్--2 విజేత షేక్ రేష్మకు టిడిపి నేతల అభినందనలు

డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా ఎన్నికైన పామూరు యువతికి ఘన సత్కారం



**పామూరు ,ఫిబ్రవరి 7, క్రైం కౌంటర్** గ్రూప్--2 పరీక్షల్లో విజయం సాధించి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా ఎన్నికైన పామూరు కేంద్రానికి చెందిన షేక్ రేష్మను పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పామూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్, పామూరు పట్టణ అధ్యక్షుడు అమీర్ బాబు, ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి,మోబీనమౌలలి, నోసెమ్ నాగేంద్ర లు అభినందించారు.ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి, పట్టుదల, కృషితో సాధించిన ఈ విజయం పామూరు యువతకు ఆదర్శంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. నిరంతర శ్రమ, లక్ష్యపూరిత అధ్యయనంతో ఉన్నత స్థానానికి చేరుకున్న షేక్ రేష్మ ప్రయాణం అనేక మందికి ప్రేరణనిస్తుందని అన్నారు.పామూరు ప్రాంతం నుంచి ప్రభుత్వ సేవల్లోకి ప్రతిభావంతులు రావడం గర్వకారణమని, 2026 నాటికి మరిన్ని యువతులు ఉన్నత హోదాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఆమె సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# ఆ స్కూల్ లో సీటొస్తే పండగే....సీబీఎస్ఈ ఇంగ్లీష్ మీడియం, హాస్టల్, ఫుడ్, యూనిఫాంతో సహా ఫ్రీ

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07** ఆంధ్రప్రదేశ్‌లోని ఆ స్కూల్‌లో చదివేవారికి చదవు, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితం.. అది కూడా సీబీఎస్ఈ సిలబస్ ఉంటుంది. ఈ ఏకలవ్య మోడల్ స్కూల్ (ఈఎంఆర్)లో ఆరో తరగతి నుంచి ఇంటర్ (12వ తరగతి) వరకు ఉచితంగా విద్యను అందిస్తారు. ఏపీలో మొత్తం 28 ఏకలవ్య మోడల్ స్కూల్స్‌లు ఉన్నాయి.. మొత్త 1680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏకంగా 11 స్కూల్స్ ఉన్నాయి. ఈఎంఆర్ పాఠశాలల్లో కో-ఎడ్యుకేషన్, ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన ఉంటుంది. ఈ స్కూల్స్ విశాలంగా 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశం దక్కితే.. 12వ తరగతి వరకు ఉచితంగా చదువుకోవచ్చు.. హాస్టల్ కూడా ఉచితం.

ఈ స్కూల్స్‌లో ఒక్కో క్లాస్‌కు 60 సీట్లు (30 సీట్లు బాలికలు, మరో 30 సీట్లు బాలురకు) అందుబాటులో ఉంటాయి. ఈ 60 సీట్లలో 48 సీట్లు గిరిజన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 12 సీట్లలో పీవీటీజీలకు 3.. అనాథ పిలల్లకు 6 (ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ కులాల) సీట్లు.. దివ్యాంగులు, సంచార కుటుంబాల పిల్లలకు 3 సీట్లు కేటాయిస్తారు. ఈ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నారు.. ఈ నెల 28 (ఫిబ్రవరి) వరకు గడువు ఉంది. మార్చి 31కి 10 ఏళ్ల నుంచి 13 ఏళ్ల వయసు ఉన్న ఐదో తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఏడాదికి ఆదాయం లక్షకు మించకూడదు, తెల్ల రేషన్ కార్డు ఉండాలి.

ఈ స్కూల్స్‌లో సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.. రూ.50 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు వారి పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సంతకంతో దరఖాస్తును అప్‌లోడ్ చేయాలి. అలాగే విద్యార్థికి సంబంధించిన తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్.. కులం, నివాస స్థలం, రేషన్ కార్డు వంటి వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి ప్రింట్ తీసుకోవాలని..



దానిని తీసుకెళ్లా ఏకలవ్య స్కూల్‌లో అందజేయాల్సి ఉంటుంది. అనంతరం ఏప్రిల్ 4న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.. పరీక్షా కేంద్రాలను ఆయా జిల్లాల్లోని ఈఎంఆర్, గురుకుల కళాశాల, పాఠశాలల్లో ఏర్పాటు చేస్తారు. ఈ ప్రవేశ పరీక్ష ఐదో తరగతి సిలబస్‌పై 100 మార్కులకు నిర్వహిస్తారు. మెంటల్ ఎబిలిటీ 50 మార్కులు, అర్థమేటిక్ 25 మార్కులు, తెలుగు భాషపై 25 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఈ ఏకలవ్య స్కూల్స్‌లో, హాస్టల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి.. స్కూల్ గ్రౌండ్ కూడా ఉంటుంది. సీట్లు సాధించిన విద్యార్థులకు బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, షూ, టై, బెడ్‌షీట్, రగ్గులు, ప్లేట్, గ్లాస్, పెట్టె ఉచితంగా అందజేస్తారు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉండే ఏకలవ్య స్కూల్స్‌లో సంప్రదించొచ్చు. స్కూల్‌లో కూడా దరఖాస్తు ప్రక్రియ చేస్తారు. బయట ఇంటర్నెస్ సెంటర్లలో కూడా https://aptwgurukulam.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మాలకొండ ఆదాయం రూ. 7,96,793లు



**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి**,మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహా స్వామి ఆలయానికి రూ 796793లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ చెంద్రశేఖర్ తెలిపారు.అష్టోత్తరం రూ 7050,కుంకుమర్చన రూ 20680, తలనీలాలు రూ 27325,వాహన పూజలు రూ 2500,ప్రత్యేక దర్శనం రూ 2,36,800,స్థలపురాణం రూ 600,రూమ్ అద్దెలు, రూ 25860,కవర్లు రూ 9425,లడ్డు ప్రసాదం రూ 2,08,380,అన్నదానం రూ2,48,057,విరరాలు రూ 10,116,మొత్తం కలిపి రూ 7,96,793,లక్షల ఆదాయం వచ్చిందని ఆయన తెలియజేశారు.

# పొగాకు రైతులకు..భారీ ఊరట రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చొరవ

## బ్రాండ్‌లేని పొగాకుపై 18% సుంకం పూర్తిగా రద్దు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రైతులకు రూ.35 లక్షల వరకూ చేకూరనున్న మేలు



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07**పొగాకు రైతులకు భారీ ఊరట లభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వర్జీనియా పొగాకు పండి స్తున్నారు. తరాల నుంచీ ఈ సాగులో ఉన్న రైతులు చాలామంది ఉన్నారు. అయితే నెల క్రితం కేంద్ర ప్రభుత్వం బ్రాండ్‌లేని, ప్యాక్ చేయ ని పొగాకుపై 18% ఎక్సయిజ్ పన్ను విధించింది. ఇప్పటికే పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోవ డానికి తోడు ఇప్పుడు ఈ సుంకం వల్ల మరింత నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. అయితే రాజమహేం ద్రవరం ఎంపీ పురందేశ్వరి చొరవతో ఆ పన్ను రద్ద యింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి పొగాకు రైతులకు రూ.35లక్షల వరకూ మేలు చేకూరనుంది.

5వేల ఎకరాల్లో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్ఎ ల్ఎస్(నార్త్ లైట్ సాయిల్), ఎన్‌బీఎస్ (నార్త్ బ్లాక్ సాయిల్) అనే రెండు రకాల వర్జీనియా పొగాకును పండిస్తున్నారు. ఎక్కువగా గోదావరి లంకలు, తొర్రే డు, రాజానగరం, కోరుకొండ, గండేపల్లి, రంగంపేట, దేవరపల్లి, గోపాలపురం ప్రాంతాల్లో 1200 మంది రైతులు సుమారు 5వేల ఎకరాల్లో పొగాకును సాగు చేస్తుండగా.. ఆకును పక్వానికి తీసుకురావడానికి 1500 వరకూ బ్యారెన్లు ఉన్నాయి. మొత్తం అమ్మకం జరిగే వరకూ పెట్టుబడి ఎకరాలకు రూ.3.50లక్షలు ఖర్చవుతుం ది. మార్చి నెల నుంచీ ఆగస్టు వరకూ పొగాకు బోర్డు ద్వారా అమ్మకాలను నిర్వహిస్తారు. రోజుకు ఒక మొక్క నుంచి రెండు మూడు ఆకులు కోస్తూ వాటిని బ్యారెన్లలో పెట్టి పక్వానికి తెస్తారు. రైతులు, కొనుగోలుదారులకు మధ్యవర్తిగా పొగాకు బోర్డు వ్యవహరిస్తూ రైతులకు నష్టం రాకుండా చూస్తుంది. కొత్త వంగడాలను ఇవ్వడం, సాగులో మెళకువలు, చీడపీడల నుంచి రక్షించుకోవడం వంటి వాటిలో రాజ మ ండ్రిలోని నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రి కల్చర్ (గతంలో సీటీఆర్ఐ) సహాయం చేస్తోంది.

ఢిల్లీకి నాయకులు..

బ్రాండ్‌లేని, ప్యాక్ చేయని ముడి పొగాకుపై 18 శాతం సుంకాన్ని విధిస్తూ కేంద్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం నోటిఫికేషన్ ఇచ్చింది. అంటే నూటికి రూ.18 చొప్పున సెంట్రల్ ఎక్సయిజ్ డ్యూటీ చెల్లిం చాలి. 2024-25లో కిలోకు రూ.340 ధర లభించింది. అయితే సుంకాన్ని కొనుగోలుదారుడు భరించే పరి స్థితి ఉండదని, రైతులకు ఇచ్చే ధరలో తగ్గిస్తారని పొగాకు రైతుల్లో ఆందోళన బయలు దేరింది. అంటే రైతులకు లభించే సొమ్ములో కిలోకు రూ.60-65 వరకూ నష్టపోతారు. ఎకరాకు వెయ్యి నుంచి 1200 కిలోల వరకూ పొగాకు వస్తుంది. ఈ లెక్కన ఉ మ్మడి తూర్పులోని రైతులకు దాదాపు రూ.35లక్షల నష్టం తప్పక పోవచ్చు. ఇదే సమస్యపై కర్ణాటకలో అమ్మకాలు నిలిచి పోయారు. దీంతో ఇబ్బందిని ఈ ప్రాంత రైతులు ఎంపీ పురందేశ్వరి దృష్టికి తీసు కెళ్లారు. ఆమె చొరవ తీసుకొని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వద్దకు పొగాకు రైతు సం ఘం నాయకులను ఢిల్లీ తీసుకెళ్లారు. దీంతో 18 శాతం సుంకాన్ని పూర్తిగా రద్దు చేస్తూ ఈ నెల 1న నోటిఫికేషన్ జారీ అయ్యింది. మన ప్రాంతం తోపాటు దేశంలోని పొగాకు రైతు లందరికీ మేలు చేకూరినట్లయ్యింది. ఐటీసీతోసహా 20 పెద్ద కంపె నీలు కొనుగోలుదారులుగా ఉన్నారు. ఈ ప్రాంతానికి సంబంధించి దేవరపల్లిలో ఉన్న పొగాకు బోర్డు ప్రాంగణంలో అమ్మకం, కొనుగోలు ప్రక్రియ జరుగుతోంది. రాష్ట్రంలో చూస్తే ఏడాదికి 300 మిలియన్ల కిలోల పొగాకు సాగవుతుండగా.. 100 మిలియన్లు దేశీయంగా వివిధ ఉత్పత్తుల్లో వినియో గిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో 80 మిలి యన్ల కిలోల వర్జీనియా రకం పొగాకును సాగు చేస్తున్నారు.

రైతులకు ఉపశమనం

పురందేశ్వరి, ఎంపీ

పొగాకు రైతులు పన్ను సమస్యను నాకు చెప్పారు. ఇది తీవ్రమైన సమస్యగా భావించాం. వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లడం తోపాటు రైతులను ఆర్థిక మంత్రి వద్దకు తీసు కెళ్లగా వారి ఇబ్బందిని వివరించారు. దీంతో కేంద్ర ఎక్సయిజ్ పన్నును పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణ యం వెలువడింది. ఈ సడలింపు వల్ల పొగాకు రైతులకు ఊరట లభించడంతోపాటు వ్యవసాయ రంగానికి మరింత బలాన్ని ఇస్తుంది.

ఆందోళనలో పడిపోయాం

ఓబులనేని కృష్ణ చైతన్య, పొగాకు రైతు సంఘం

జిల్లా నాయకుడునెల రోజుల నుంచీ పొగాకు రైతులు ఆందోళనలో పడిపోయారు. వారసత్వం గా వచ్చిన వృత్తి మాదిరిగా పొగాకు సా గుకు అలవాటు పడిపోయాం. ఇప్పుడు కేంద్రం అధిక పన్ను విధించడంతో పంట చేతికొచ్చే దశ కావడంతో తీవ్రంగా అయో మయంలో పడిపోయాం. మా సమస్యను ఎంపీ పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లగానే కేంద్ర ఆర్థిక మంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని మమ్మల్ని తీసుకెళ్లారు. వెంటనే పన్ను రద్దు చేస్తూ నోటిఫి కేషన్ రావడంపై ఎంపీ పురందేశ్వరికి పొగాకు రైతుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నాం.

# సేవే పరమావధిగా సాగే ఎమ్మెల్యే ఉగ్ర కు జన్మదిన శుభాకాంక్షలు

## ప్రజల ఆశీర్వాదాలతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలి -- మన్నం రమణయ్య



**పామూరు, ఫిబ్రవరి 7, క్రైం కౌంటర్** కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన సందర్భంగా పామూరు మండలం కంబాలదిన్నె టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య , కంబాలదిన్నె టిడిపి కార్యకర్తలు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవే పరమావధిగా, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకులకు దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, ప్రజల కోసం మరింత సేవ చేసే శక్తిని ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదాలతో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జీవితం విజయవంతంగా కొనసాగాలని ప్రార్థించారు.

ప్రజా సమస్యలపై లోతైన అవగాహనతో, అంకితభావంతో పనిచేస్తున్న నాయకత్వం వల్లే నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో కనిగిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.2026లో ప్రజాసేవే లక్ష్యంగా, సంక్షేమం--అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# జనసేన పార్టీకి రాజీనామా చేయలేదు: బొలిశెట్టి సత్యనారాయణ

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07**జనసేన పార్టీకి తాను రాజీనామా చేయలేదని, కేవలం తన పదవి నుంచి మాత్రమే వైదొలిగానని బొలిశెట్టి సత్యనారాయణ స్పష్టం చేశారు. పర్యావరణానికి సంబంధించిన కేసు వేయడం వల్ల పవన్ కళ్యాణ్‌కు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యంతోనే తాను దూరంగా ఉన్నట్లు తెలిపారు. పరిశ్రమల కాలుష్యం వల్ల పర్యావరణం తీవ్రంగా నష్టపోతోందని, ముఖ్యంగా ఉత్తర కోస్తా, కాకినాడ ప్రాంతాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉందని, సముద్ర జీవవైవిధ్యం ధ్వంసమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ భాగస్వామిగా ఉంది. ఓ వైపు నేను జనసేన ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సమయంలోనే.. మరోవైపు కూటమి ప్రభుత్వం మీద కేసు కొనసాగుతుంది. పార్టీలు మారినా ప్రభుత్వాలు కొనసాగుతాయి కావున ఆ కేసు అలాగే కొనసాగుతుంది.ఈ నేపథ్యంలో నేను జనసేన పార్టీ పర్యావరణ ప్రధాన కార్యదర్శిగా ఉండటం సరికాదని.. ఆ పదవికి రాజీనామా చేశా. జనసైనికుడిగా కొనసాగుతున్నా. పార్టీకి రాజీనామా చేయలేదు.. పదవికి మాత్రమే రాజీనామా చేశా. నేను రాసిన లెటర్‌లో కూడా ఈ విషయం ఉంది. ఈ కేసు పూర్తైన తర్వాత జనసేన పార్టీలో పవన్ కళ్ష?్యణ్ ఏ బాధ్యతలు అప్పగించినా పనిచేస్త?నని అందులో ఉంది. కానీ ఎవరిష్టం వచ్చినట్లు వారు ప్రచారం చేస్తున్నారు. అందుకే క్లారిటీ ఇస్తున్నా.." బొలిశెట్టి సత్యనారాయణ క్లారిటీ ఇచ్చారు.



# సినిమా



## ఈ అందాల నటి జీవితం కన్నీటి వ్యథ..


అభినయం, ఆకట్టుకునే అందంతో ప్రేక్షకులను అలరించిన నటి శ్రీ విద్య జీవితం తెరపై కనిపించినంత మురిపించేది కాదు. ఎన్నో కలలతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె వ్యక్తిగత జీవితంలో అడుగడుగునా కష్టాలను ఎదుర్కొన్నారు. ప్రేమించినవాడు దక్కలేదు, పెళ్లి చేసుకున్నవాడు మోసం చేశాడు. 1953 జులై 24న చెన్నైలో జన్మించిన శ్రీ విద్య తల్లి ఎం.ఎల్. వసంతకుమారి ప్రఖ్యాత కర్ణాటక విద్వాంసురాలు. తండ్రి వికటన్ ఆర్. కృష్ణమూర్తి తమిళ చిత్రాల్లో హాస్యనటుడు. శ్రీ విద్య పుట్టిన కొంతకాలానికి తండ్రికి పక్షవాతం రావడంతో కుటుంబం ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. దీంతో 14 ఏళ్ల వయసులోనే, 1967లో శివాజీ గణేశన్ నటించిన పౌరాణిక చిత్రం "తిరువరుట్చెల్వర్"తో బాలనటిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాల్సి వచ్చింది. ఈ చిత్రంలో మహానటి సావిత్రి, జెమిని గణేశన్, కేఆర్ విజయ లాంటి నటులతో కలిసి శివశక్తి నందనం పాత్ర పోషించారు. ఆ తర్వాత 1969లో "కుమార సంభవం" చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేశారు.

తెలుగులో శ్రీ విద్య తొలి చిత్రం 1969లో వచ్చిన "పేదరాశి పెద్దమ్మ కథ". ఇందులో కాంతారావు సరసన రాజకుమారి పాత్రను పోషించారు. ఆ తర్వాత "తాత మనవడు" చిత్రంలో "రాయంటి నా మొగుడు రంగా మెళ్ళి తిరిగి రాలేదు" అనే ఐటెం సాంగ్‌లో కనిపించారు. హీరో కృష్ణ నటించిన "గాలిపటాలు" చిత్రంలో, అలాగే ఎన్టీఆర్ నటించిన "కథానాయకుని కథ"లో ఆయనకు చెల్లెలిగా, "రాముని మించిన రాముడు"లో ఆయన సరసన ఓ హీరోయిన్‌గా నటించారు. అయితే, 1975లో రజనీకాంత్, కమల్ హాసన్‌లతో కలిసి నటించిన తమిళ చిత్రం "అపూర్వ రాగంగళ్" తెలుగు రీమేక్ అయిన "తూర్పు పడమర"తోనే శ్రీ విద్యకు మంచి గుర్తింపు లభించింది. ఈ చిత్రంలోని "శివరంజని, నవరాగిణి" పాట ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఈ చిత్రం తర్వాత ఆమె తెలుగు, తమిళ భాషల్లో బిజీ అయ్యారు.

తెలుగులో దర్శకరత్న దాసరి నారాయణరావు, తమిళంలో దర్శకుడు కే. బాలచందర్ శ్రీ విద్యకు మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. "నూట్రిక్కు నూరు", "ఢిల్లీ టు మద్రాస్" చిత్రాలతో బాలచందర్ ఆమెను హీరోయిన్‌గా పరిచయం చేశారు. దాసరి తన తొలి చిత్రం "తాత మనవడు"లో సాంగ్ చేసే అవకాశం ఇచ్చి, ఆ తర్వాత "బంట్రోతు భార్య", "కన్యా-కుమారి" చిత్రాల్లో ముఖ్య పాత్రలు ఇచ్చారు. శ్రీ విద్య తర్వాత కాలంలో బాలకృష్ణ "ఇన్‌స్పెక్టర్ ప్రతాప్", "రాముడు భీముడు", "బంగారు బుల్లోడు", "గాండీవం" వంటి చిత్రాల్లో, చిరంజీవి "కొండవీటి దొంగ", "ముగ్గురు మొనగాళ్లు" చిత్రాల్లో, వెంకటేష్ "బ్రహ్మపుత్రుడు"(తల్లి పాత్ర), "చిన్నబ్బాయి", "ధర్మచక్రం" చిత్రాల్లో, నాగార్జున "విక్కీ దాదా" చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ఆమె గాయనిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు.

వ్యక్తిగత జీవితంలో శ్రీ విద్య ఎన్నో కష్టాలను అనుభవించారు. తమిళ చిత్రాల్లో నటిస్తున్నప్పుడే ఆమె కమల్ హాసన్‌ను గాఢంగా ప్రేమించారు. కమల్ కూడా ఆమెను ప్రేమించారు. వారి వివాహం గురించి కమల్, శ్రీ విద్య అన్నయ్య శంకర్‌కు చెప్పారు. అయితే, శ్రీ విద్య తల్లి వసంతకుమారి వారి వివాహానికి అంగీకరించలేదు. ఇద్దరూ ఒకే ఇండస్ట్రీలో ఉండటం, శ్రీ విద్య కెరీర్ ఇప్పుడిప్పుడే ఊపందుకోవడం, కమల్ ఆమె కంటే ఏడాది చిన్నవాడు కావడం వంటి కారణాలతో ఆమె పెళ్లిని నిరాకరించారు. తల్లి మాటకు ఎదురు చెప్పలేక, ప్రేమించిన కమల్‌కు దూరమయ్యారు శ్రీ విద్య. కొంతకాలానికి కమల్ వాణీ గణపతిని వివాహం చేసుకున్నారు. కమల్‌కు దూరమైన తర్వాత, 1976లో మలయాళ చిత్రం "శ్రీ కన్నల్" నిర్మాత జార్జ్ థామస్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. మానసికంగా దగ్గరైన శ్రీ విద్య, జార్జ్ మాటలు విని ఆయన వలలో పడిపోయారు. బ్రాహ్మణ యువతి అయిన శ్రీ విద్య, క్రైస్తవుడైన జార్జ్ వివాహానికి ఆమె తల్లి మళ్ళీ అంగీకరించలేదు. అయితే, ఈసారి తల్లి మాట వినకుండా, జార్జ్‌తో కలిసి ముంబై వెళ్లి క్రైస్తవ మతం స్వీకరించి 1978 జనవరి 8న వివాహం చేసుకున్నారు. దాదాపు మూడేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండి దాంపత్య జీవితం గడిపారు.





## చింతపండు తింటున్నారా..?

చింతపండు అనేది అందరికి తెలిసిన పుల్లని, ఆమ్లరుచి గల పండు. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే దీనిని మన పూర్వకాలం నుంచి దాదాపు అన్ని వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. వంటకాలకు రుచి అందించడంతోపాటు ఆరోగ్యానికి మంచిది. ఎన్నో అనారోగ్య సమస్యలకు కూడా చెక్ పెడుతుందీ పండు. ఆయుర్వేదంలో చింతపండును శక్తివంతమైన జీర్ణ సుముఖ పండు అని పరిగణిస్తారు. ఎందుకంటే.. చింతపండు ప్రధానంగా జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. దీనిలోని పుల్లని రుచి, టార్టారిక్, ఇతర సేంద్రీయ ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి, ఫైబర్, పాలీశాకరైడ్లు (పెక్టిన్, మ్యూసిలేజ్) పేగు కదలికలను సులభతరం చేస్తాయి.

చింతపండు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం తగ్గుతాయి. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. భారీ, కారమైన ఆహారం కూడా సులభంగా జీర్ణమవుతుంది. చింతపండు తినడం వల్ల లాలాజలం స్రవిస్తుంది. ఇది కాలేయం నుంచి పిత్తాన్ని విడుదల చేస్తుంది. దీంతో కొవ్వుల జీర్ణక్రియ సులభం అవుతుంది.

శరీరంలోని విషాలను తొలగిస్తుంది

చింతపండు విటమిన్ జ, యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్‌లతో సమృద్ధి చెందింది. ఇవి.. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో వాపును తగ్గిస్తాయి. శరీర వేడిని సమతుల్యంగా ఉంచుతాయి. అత్యధిక వేడిలో జ్వరం, వాంతులు, విరేచనాల సమయంలో చింతపండు నీరు సహజ నివారణిగా ఉపయోగపడుతుంది.

గుండె. రక్తపోటు కోసం

చింతపండులోని ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు.. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో ఉపయోగపడతాయి.

కీళ్ల నొప్పులు, మలబద్ధకం నివారణ

చింతపండును ఆయుర్వేదంలో బాహ్య, అంతర్గత ఔషధంగా ఉపయోగిస్తారు. కీళ్ల నొప్పులు, రుమాటిజం, వాపులను తగ్గించడంలో చింతపండు పేస్ట్ ఉపయోగపడుతుంది. మహిళలలో మెన్స్ట్రువల్ సమస్యలు, అలసట, బలహీనతలను తగ్గిస్తుంది.

మితమైన వాడకం ముఖ్యం

చింతపండు అధికంగా తినడం వల్ల.. అసిడిటీ, గ్యాస్, గుండెలో మంట, దంతసమస్యలు, గొంతు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. అందువల్ల, ఆయుర్వేద ప్రకారం చింతపండును సరైన పరిమాణంలో మాత్రమే తీసుకోవడం ఉత్తమం. చిన్న మోతాదులో చింతపండు చట్నీ లేదా చింతపండు చారు/సాంబార్ తీసుకోవడం జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.

పేగులో వాయువును తగ్గించి, కడుపును శుభ్రంగా ఉంచుతుంది. చింతపండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు; ఇది జీర్ణక్రియ, హృద్రోగ, ఇమ్యూనిటీ, శరీర ఆరోగ్యంలో సహాయకంగా ఉంటుంది. సరైన పరిమాణంలో దీన్ని తీసుకోవడం వల్ల, శరీరం ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటుంది.

ఈ వార్తలోని సమాచారం అందుబాటులో ఉన్న వనరుల నుంచి సేకరించి పాఠకుల ఆసక్తి మేరకు అందించడం జరిగింది. దీనిని టీవీ9 తెలుగు ధృవీకరించదు.)



## పచ్చి గుడ్లు తాగితే ఎక్కువ బలం వస్తుందా..?

ప్రోటీన్ లెక్క ఇది : నోయిడాలోని నిదాన్ మదర్ అండ్ చైల్డ్ కేర్ శిశువైద్యుడు డాక్టర్ రాజీవ్ రంజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రోటీన్ శోషణ విషయంలో ఉడికించిన గుడ్లదే పైచేయి. వీటిని తిన్నప్పుడు మన శరీరం అందులోని ప్రోటీన్‌ను 90 శాతం వరకు గ్రహించగలదు. పచ్చిగా తీసుకున్నప్పుడు శరీరం కేవలం 50 శాతం ప్రోటీన్‌ను మాత్రమే గ్రహిస్తుంది. అంటే మీరు పచ్చి గుడ్లు తింటే సగం ప్రోటీన్ వృధా అవుతుందన్నమాట.సాల్మోనెల్లా బ్యాక్టీరియా: పచ్చి గుడ్లలో సాల్మోనెల్లా అనే ప్రమాదకర బ్యాక్టీరియా ఉంటుంది. ఇది తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్, విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పికి దారితీస్తుంది.బయోటిన్ లోపం: పచ్చి గుడ్లలో అవిడిన్ అనే ప్రోటీన్ ఉంటుంది. ఇది మన శరీరం విటమిన్ బి7ను గ్రహించకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల జుట్టు రాలడం, గోర్లు పెళుసుగా మారడం వంటి సమస్యలు వస్తాయి. గుడ్డును ఉడికించడం వల్ల ఈ అవిడిన్ నాశనం అవుతుంది.జీర్ణ సమస్యలు: పచ్చి గుడ్లు తింటే వికారం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు ఎదురవ్వడం చాలా సాధారణం. అంతేకాకుండా గుడ్లలో ప్రోటీన్‌తో పాటు విటమిన్ డి, బి12, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అయితే వ్యక్తి వయస్సు, బరువు, వాతావరణాన్ని బట్టి గుడ్ల సంఖ్యను నిర్ణయించుకోవాలి.గుడ్లు సహజంగా వేడిని కలిగిస్తాయి కాబట్టి వేసవిలో వీటి పరిమాణాన్ని పరిమితం చేయడం మంచిది. పూర్తి పోషకాలు అందాలంటే గుడ్లను ఎల్లప్పుడూ ఉడకబెట్టి లేదా వండి మాత్రమే తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

## కష్టాల్లోనూ కసిగా పోరాడారు..

ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. టీ20 వరల్డ్ కప్ 2026 ఆరంభ మ్యాచ్‌లోనే అమెరికాను 29 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టింది. టాప్ ఆర్డర్ తడబడినా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వీరోచిత బ్యాటింగ్‌తో జట్టును గెలుపు తీరానికి చేర్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్ చేస్తూ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ షాక్విక్ 4 వికెట్లతో భారత టాప్ ఆర్డర్‌ను వణికించాడు. పవర్‌ప్లేలోనే భారత్ 4 వికెట్లు కోల్పోయి 46 పరుగులకే పరిమితమైంది. అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25), శివం దూబే (0) వెనువెంటనే అవుట్ కావడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన అనుభవాన్నంతా ఉపయోగించి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 84 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు.

162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా జట్టు భారత బౌలర్ల ధాటికి తలవంచింది. మహమ్మద్ సిరాజ్ రెండో ఓవర్లోనే గౌస్‌ను అవుట్ చేసి అమెరికాకు షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ అమెరికా కెప్టెన్ మోనాంక్ పటేల్‌ను డకౌట్ చేయడంతో ఆ జట్టు కోలుకోలేకపోయింది. అమెరికా బ్యాటర్లలో మిలింద్ (34), సంజయ్ (37) కాసేపు పోరాడినా, భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారు. చివరికి అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులకే పరిమితమైంది. భారత్ తరపున సిరాజ్ 2, అర్ష్‌దీప్ 2, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

వైరల్ ఫీవర్ కారణంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌కు దూరమవ్వడం భారత అభిమానులను ఆందోళనకు గురిచేసింది. అతని స్థానంలో వచ్చిన మహమ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి రెండు వికెట్లు తీశాడు. ఇక అమెరికా జట్టులో అలీ ఖాన్, శుభమ్ రంజనే గాయపడటం ఆ జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. ఈ విజయంతో భారత్ గ్రూప్ టేబుల్‌లో టాప్ స్థానానికి చేరుకుని తన తదుపరి మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది.




## ముంబైలో సూర్య ప్రతాపం..కష్టాల్లో ఉన్న భారత్‌ను ఆదుకున్న కెప్టెన్ ఇన్నింగ్స్.

ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, అమెరికా మధ్య జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఉత్కంఠభరిత పోరులో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. ఒకానొక దశలో పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్‌ను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. అమెరికా బౌలర్ల ధాటికి స్టార్ బ్యాటర్లు విఫలమైనా, సూర్య ఒంటరి పోరాటం చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు.

టాస్ గెలిచిన అమెరికా ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుని భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఊహించినట్టే అమెరికా బౌలర్లు భారత బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఓపెనర్ అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ కాగా, ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25) కాసేపు పోరాడారు. అయితే అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ షాక్విక్ వేసిన ఆరో ఓవర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. ఒకే ఓవర్లో ఇషాన్, తిలక్, శివం దూబేలను అవుట్ చేసి భారత్ నడ్డి విరిచాడు. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 46 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ కూడా విఫలమవడంతో భారత్ వంద పరుగులు దాటడం కష్టమే అనిపించింది.

క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన అనుభవాన్ని అంతా రంగరించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మొదట నెమ్మదిగా ఆడినా, క్రీజులో కుదురుకున్నాక అమెరికా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్య, చివరికి 49 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 84 పరుగులు చేసి ఔటయ్యాడు. అక్షర్ పటేల్(14)తో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 161 పరుగుల గౌరవప్రదమైన స్కోరును సాధించగలిగింది.

అమెరికా బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికీ, మ్యాచ్ చివరలో ఇద్దరు కీలక ఆటగాళ్లు గాయపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. మెయిన్ బౌలర్ అలీ ఖాన్ 18వ ఓవర్ వేస్తూ మధ్యలోనే మైదానాన్ని వీడగా, అతని ఓవర్‌ను పూర్తి చేసిన శుభమ్ రంజనే కూడా మోకాలి నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఇక 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగనున్న అమెరికాను భారత బౌలర్లు ఎలా అడ్డుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా లేని లోటును మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ భర్తీ చేయాల్సి ఉంది. వాంఖడే పిచ్‌పై మంచు ప్రభావం ఉండే అవకాశం ఉండటంతో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం భారత్‌కు సవాలుతో కూడుకున్న పని.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com